# నిరుద్యోగ యువతకు ఉపాధి దిశగా మెగా జాబ్ మేళా

- 80 కంపెనీల ద్వారా 3200 పైగా ఉద్యోగ అవకాశాలు
- ఎంపికైన అభ్యర్థులకు మే 23న నియామక పత్రాలు
- ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** నిరుద్యోగ యువతకు ఉపాధి దిశగా మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం



మంగళవారం | 5 | మే | 2026 ◆ పేజీలు : 6






# పిపిసి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- హమాలి, రవాణా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండాలి
- రాష్ట్ర మంత్రులు హైదరాబాద్ నుండి నిర్వహించిన వీసీలో ఖమ్మం కలెక్టరేట్ నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్

## పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** పిపిసి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సివిల్ సప్లైస్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.సివిల్ సప్లైస్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు వాకాటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొనగా, ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పిపిసి కేంద్రాలకు మొత్తం 21.34 లక్షల మెట్రిక్ టన్నుల వరి చేరగా ఇప్పటి వరకు 13.32 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసినట్లు తెలిపారు.వరిని తక్షణమే కొనుగోలు చేయాలని, హమాలి, రవాణా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకస్మాత్తుగా కురిసిన వర్షాల వల్ల తడిసిన వరిని వెంటనే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు.రైతులకు వాతావరణ హెచ్చరికలను నిరంతరం అందించాలని, జిల్లా స్థాయిలో తగినంత టార్పెలిన్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అన్ని పిపిసి కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ సౌకర్యాలు

మిగతా 2 లో...

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ప్రతి ఒక్కరూ సభ్యత్వం పొందాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- మానవ సేవే మాధవ సేవ – ప్రతి ఒక్కరూ సభ్యత్వం పొందాలి
- డాక్టర్లు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి
- శాఖల వారీగా లక్ష్యాలతో సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

మిగతా 2 లో...



# ప్రాధాన్య అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- అభివృద్ధి పనుల్లో ఆలస్యం లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలి
- పెండింగ్ భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- కలెక్టరేట్లో అభివృద్ధి పనులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రాధాన్య అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో చేపట్టిన ప్రాధాన్య అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇల్లందు రోడ్ వద్ద ఉన్న నిర్మాణాన్ని రేనోవేషన్ చేసి ఫ్రూట్ మార్కెట్ స్థాపనకు సంబంధించిన ప్రతిపాదనలు సమయానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.ఫ్రూట్ మార్కెట్ కాంపౌండ్ వాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్

మిగతా 2 లో...

## అగ్ని ప్రమాదంలో కాలిపోయిన మొక్క జొన్న పంటలను పరిశీలించిన తెలుగు దేశం పార్టీ బృందం



**చింతకాని మే4ప్రజాజ్యోతి ప్రతినిధి :**మండలం పాతర్లపాడు గ్రా మంలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్నికి కాలిపోయిన మొ క్కజొన్న కంకుల రాశులను మొ క్కజొన్న బస్తాలను సోమవారం ఉదయం జిల్లా తెలుగు రైతు నాయకులు మందడపు సుధాకర్ పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతర్ల పాడు గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని మొక్కజొన్న బస్తాలు రాశులు పూర్తిగా కాలి బూడిదైనాయని రైతాంగం దిక్కు తోచని విధంగా ఉందని రైతుల పరిస్థితి హృదయ విదారకంగా ఉన్నదని నెల రోజులు దాటి కాటాలు వేసుకొని కళ్ళంలో ఉన్న పంటలను ప్రభుత్వం లారీలు పంపకుండా కాలయాపన చేయటం వలన ఈ పరిస్థితి దాపురించిందని చింతకాని తిమ్మినేని పాలెం గ్రామాల్లో కూడా రైతులు తీవ్రంగా నష్టపోయారని దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు అలాగే పాతర్లపాడు గ్రామంలో గొర్రెల కాపరి ఓ పెన్ బోయిన వీరబాబు గొర్రెలు మేకలు సుమారు 60 శాల్తీలు నిప్పులు అంటుకుని మరణించాయని కొన్ని గొర్రెలు కాలిన గాయాలతో ప్రమాదకర స్థితిలో ఉన్నాయని వెంటనే ప్రభుత్వం గొర్రెల కాపరికి నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని కోరారు అలాగే కౌలు రైతుల పరిస్థితి చాలా దయనీయంగా మారిందని ముందస్తుగా కౌలు చెల్లించి బ్యాంకుల్లో ప్రైవేటు వ్యాపారస్తులు దగ్గర అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పంట పండిస్తే కళ్ళు ఎదుటే పంట అగ్నికి ఆహుతి అవుతుంటే మొక్కజొన్న కవులు రైతులు గుండెలవిసిపోతున్నాయని ఆయన ఆవేదన చెందారు వెంటనే ప్రభుత్వం అధికారుల ద్వారా అంచనా వేసి సత్వరమే కళ్ళల్లో ఉన్న మొక్కజొన్న పంటను లారీల ద్వారా ట్రాన్స్పోర్ట్ చేసి కాలిపోయిన రైతులకి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు తేలుకుంట్ల శ్రీనివాసరావు మండల కోశాధికారి మల్లెల సత్యనారాయణ మండల నాయకులు బండి ప్రసాద్ కూసిపూడి సతీష్ తాళ్లూరి రాము మండపూడి రామకృష్ణ ముప్పాళ్ళ కోటయ్య మరియు గ్రామంలో నష్టపోయినటువంటి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త సుధీర్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

- కందాళ. ఉపేందర్ రెడ్డి



**పాలేరు ఆర్.సి మే 4 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలం గొరిల్లపాడు తండా బిఆర్ఎస్ కార్యకర్త బానోత్ సుధీర్ నాయక్ తండ్రి గారైన బానోత్ జామికిరామ్ ఇటీవల కాలంలో మరణించిన విషయం తెలుసుకొని సోమవారం వారి స్వగ్రాహం నందు స్వర్గీయ జానకి రామ్ చిత్రపటానికి పూలమాల లేచి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల పార్టీ అధ్యక్షులు వేముల వీరయ్య, జిల్లా నాయకులు మల్లిడి వెంకన్న, మాజీ సర్పంచ్ బానోత్ కిషన్ నాయక్ మాజీ ఎంపీటీసీ జర్పుల బాలాజీ నాయక్, సోషల్ మీడియా అధ్యక్షుడు వద్త్యా బాలకృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షులు తేజావత్ శ్రీను నాయక్, బానోత్ జీవన్ నాయక్ ,చోటి నాయక్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పిపిసి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

కల్పించడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. మెరుపు,వానల సమయంలో రైతులు కరెంట్ స్తంభాలు, పెద్ద చెట్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించి ఎఫ్ఏక్యూ వరి తక్షణమే లిఫ్టింగ్ చేయాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు ఎలాంటి ఆలస్యం లేకుండా సమయానికి పూర్తి చేయాలని, గన్నీ బ్యాగుల కొరత లేకుండా అవసరానికి అనుగుణంగా నిల్వలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రైతులు గన్నీ బ్యాగులు తీసుకువస్తే వాటికి కూడా ప్రభుత్వం చెల్లింపులు చేస్తుందనే విషయాన్ని విస్తృతంగా తెలియజేయాలని సూచించారు.ప్రస్తుతం జిల్లాకు 49 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, మిగతా అవసరాలకు ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి పిపిసి కేంద్రంలో అవసరమైన నిల్వలు తప్పని సరిగా ఉండాలని ఆదేశించారు.హమాలీల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ట్రక్ షీట్లు సమయానికి జెనరేట్ చేయాలని,వరి నాణ్యతను నిరంతరం పరిశీలించాలని తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో ట్రాక్టర్, హమాలి చార్జీలపై పిపిసి కేంద్రాల ఇన్చార్జ్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో సిపిఓ శ్రీనివాస్,డిఆర్డిఓ శ్రీరామ్, డిసిఓ, ఆర్టీఓ,వ్యవసాయ, మార్కెటింగ్,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి దిశగా మెగా జాబ్ మేళా

(మొదటి పేజీ తరువాయి...)



భాగంగా ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ గార్డెన్స్లో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీ, ఫార్మసీ, బ్యాంకింగ్, మాన్యుఫ్యాక్చరింగ్, మార్కెటింగ్, తదితర రంగాలకు చెందిన 80 కంపెనీలు పాల్గొని సుమారు 3200 పైగా ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. సోమవారం ఎంపికైన అభ్యర్థులకు మే 23న నియామక పత్రాలు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిరుద్యోగ యువత ప్రైవేట్ ఉద్యోగాలను నిర్లక్ష్యం చేయకూడ దని స్పష్టం చేశారు. మన లక్ష్యాలపై దృష్టి ఉంచుకుంటూనే ప్రస్తుతం లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎక్కువ కాలం నిరుద్యోగిగా ఉండకుండా, ప్రారంభంలో వేతనం తక్కువగా ఉన్నప్పటికీ ఉద్యోగాన్ని స్వీకరించి అనుభవాన్ని సంపాదించుకోవాలని తెలిపారు.ప్రైవేట్ రంగంలో అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని,నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ఉండాలని సూచించారు. తనకు తెలిసిన ఒక వ్యక్తి 12 వేల వేతనంతో ఉద్యోగాన్ని ప్రారంభించి 8 సంవత్సరాల్లో లక్షల్లో సంపాదిస్తున్నారని ఉదాహరణగా పేర్కొన్నారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ మనకు ఇతర లక్ష్యాలు ఉన్నప్పటికీ ఇలాంటి అవకాశాలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఉద్యోగం ప్రారంభిస్తే ఆత్మవిశ్వాసం పెరిగి భవిష్యత్ లక్ష్యాలను సాధించేందుకు దోహదపడుతుందని, అలాగే విలువైన అనుభవం కూడా లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టాస్క్, డీట్, జిల్లా అధికారులు, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, ఈడిఎం దుర్గాప్రసాద్, డిఫెన్స్ అకాడమీ ప్రతినిధులు, కంపెనీ ప్రతినిధులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ప్రతి ఒక్కరూ సభ్యత్వం పొందాలి

(మొదటి పేజీ తరువాయి...)

తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు కలెక్టరేట్ లో కలిసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, సభ్యత్వ నమోదు విస్తృతం చేయాలని, మానవ సేవే మాధవ సేవ అన్న భావనతో రెడ్ క్రాస్ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.జిల్లాలో రెడ్ క్రాస్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడం కోసం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్ లో ప్రత్యేక కౌంటర్ను ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమం సమన్వయం కోసం జిల్లా స్థాయి నోడల్ అధికారిని నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ వైద్యులు, ప్రైవేట్ డాక్టర్లు,ఉద్యోగులు పెద్ద ఎత్తున సభ్యత్వం పొందాలని కలెక్టర్ ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. జిల్లాలోని శాఖల వారీగా సభ్యత్వ లక్ష్యాలను నిర్దేశించారు. సుమారు 15 ప్రధాన శాఖలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.సభ్యత్వం పొందదలచిన వారు మరిన్ని వివరాల కోసం 9885581603, 9440003535, 9908153033 నంబర్ల నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో డాక్టర్ వి. చంద్రమోహన్,కె.నర్సయ్య, జనార్ధన్ రావు, హరి,కెఎస్ఎన్ రెడ్డి,వెంకటేశ్వర్లు,సి.పి.ఓ. శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

## ప్రాధాన్య అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించి నిధులు మంజూరు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.శిల్పారామం కోసం ఇప్పటికే 9 ఎకరాలు ఇవ్వడం జరిగిందని, అదనంగా 3 ఎకరాలు 21 గుంటలు అవసరమని, వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను సమయానికి పూర్తి చేయాలని, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని తెలిపారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనుల్లో భాగంగా ప్రధాన సీవరేజ్ పైపులైన్ పనులను వేగవంతం చేయాలని, మొత్తం 8.5 కి.మీ పైపులైన్లో ఇప్పటికే 7.7 కి.మీ పూర్తి అయినందున మిగిలిన పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథతో ఎటువంటి మిక్సేజ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ధంసలాపురం వద్ద ఎస్టీపీ పనులు త్వరలో ప్రారంభించాలని తెలిపారు. హరిత హోటల్ నిర్మాణానికి భూమి అప్పగించడం జరిగిందని, వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో పెండింగ్ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్యాకేజీ–9లో కొంత మేరకు భూ సేకరణ సమస్య ఉందని, స్థానికులతో చర్చించి త్వరగా పరిష్కరించాలని, తహసీల్దార్, సబ్ కలెక్టర్ను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సంబంధిత జిల్లా అధికారులు,ఆర్డీఓ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## నాగులవంచ ప్రధాన రహదారిపై బిఆర్ఎస్ సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో రాస్తారాకో



**చింతకాని మే4 ప్రజాజ్యోతి ప్రతినిధి:** నాగులవంచ లో మొక్కజొన్న రైతులు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించడం తో భారీగా నిలిచిపోయిన వాహనాలు.సిపిఎం నాయకులు నున్నా నాగేశ్వరరావు,పొన్నం వెంకటేశ్వర్లు,మడుపల్లి గోపాలరావు,కొండ్రు జానకి రామయ్య,ఆలస్యం రవి, తోటకూరి వేంకటనరసయ్య,బిఆర్ ఎస్ నాయకులు మంకెన రమేష్, గురజాల హనుమంతరావు, వంకాయలపాటి లచ్చయ్య, కోపూరి నవీన్,నారపోగు నాగయ్య ల ఆధ్వర్యంలో రాస్తారోకో.వైరా సీఐ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో చింతకాని పోలీసులు భారీగా మోహరించిన రైతాంగం రాస్తారోకో విరమించలేదు. తాహసిల్దార్ బాబ్జీ ప్రసాద్ ను స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదలడానికి వీల్లేదని రైతులు నిలదీయడంతో ఫోన్ లో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి రెండు రోజుల్లో లారీలు పంపి ఖమ్మం వ్యవసాయ మార్కెట్ లో దిగుమతి చేసేలా చర్యలు చేపడతామని స్పష్టమైన హామీ ఇవ్వడం తో రాస్తారోకో కార్యక్రమాన్ని విరమించారు.దీంతో పోలీసులు రాస్తారోకో ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# వెంకటియా తండలో ఘనంగా బోనాల సంబరాలు





**కారేపల్లి, మే 4, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని వెంకటియా తండా గ్రామంలో సోమవారం గ్రామ దేవతలకు బోనాల సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎంతో భక్తి శ్రద్ధలతో, నియమనిష్టలతో గత మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు దేవ దేవుళ్ళ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మంగళం కంపెనీ ఎండి గుగులోతు రాజేందర్, బెల్ కంపెనీ ఎండి జి.రవి, మాజీ ఎంపీపీ బానోతు దేవల నాయక్, సర్పంచ్ బానోతు బూలి, గ్రామ ప్రభుత్వ ఉద్యోగ సంఘం, గ్రామ యువత సారధ్యంలో ఆర్థిక సహాయ సహకారాలతో మొదటి రోజైన శుక్రవారం ఒకటో తారీకు నాడు గణపతి హోమం, రెండో తారీకు శనివారం రోజున విగ్రహాల ఊరేగింపు హోమ కార్యక్రమం, మూడో తారీకు ఆదివారం నాడు విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ ప్రతిష్ట నూతన వాయు శివలింగం, పంచలోహ విగ్రహాల శంకుస్థాపనలు, సీతా రాముల కళ్యాణం గ్రామ గ్రామమంతా ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం మహిళలు ఎంతో పవిత్రంగా భక్తిశ్రద్ధలతో ప్రతి ఇంటి నుంచి బోనం తయారు చేసుకొని నెత్తిన అలంకరించుకొని నుత్యాలతో, ఆనందోత్సవాలతో బయలుదేరి గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, మహిళలు, దాతలు, బంధువులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముతాపురం సొసైటీలో మొక్క జొన్న కొను గోళ్ళలో బహిరంగ వసూళ్ల దందా

- బస్తాకు రూ.20 వసూళ్లు
- రైతులపై భారంగా కొనుగోలు కేంద్రం
- మొక్కజొన్న కొనుగోళ్లలో అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసు కోవాలంటు న్న రైతులు
- సొసైటీ మాజీ డైరెక్టర్ రావెల్ల కృష్ణా రావు ఆరోపణ



**నేలకొండపల్లి, మే 4 ప్రజా జ్యోతి:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మం డలం ముతాపురం గ్రామ సొసైటీలో మొక్కజొన్న కొనుగోలు కేం ద్రం ప్రారంభమైన నాటి నుంచి బహిరంగంగా అవినీతి రాజ్యమేలుతోందని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి 50కేజీల బస్తాకు రూ.20 చొప్పున బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాడని, ఎందుకు ఇవ్వాలంటూ ప్రశ్నిస్తే "నాకు సంబంధం లేదు, లారీ డ్రైవర్‌కు ఇ వ్వాలి" అంటూ తప్పించుకుంటూ దందాను కొనసాగిస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్కో రైతు వద్ద నుంచి వందల బస్తాలు రావడంతో 600 బస్తాలకు రూ.12 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని, ఈ దందా రోజూ కొనసాగుతుండడంతో వేలల్లో కాదు లక్షల్లో డబ్బు చేతులు మారుతున్నదని వాపోతున్నారు. ముతాపురం సొసైటీలో ఇప్పటికే లక్ష బస్తాలకు పైగా కాటాలు వేసినట్లు, ఇంకా సుమారు 50 వేల బస్తాలు కాటాలు వేయాల్సి ఉందని రైతులు చెబుతున్నారు. ఈ లెక్కన అక్రమ వసూళ్లు భారీ స్థాయికి చేరుకున్నాయని, రైతుల రక్తాన్ని పీలుస్తున్న ఈ వ్యవస్థపై ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నడుస్తున్న ఈ వసూళ్ల మాఫియాను తక్షణమే అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాగా కమీషన్ తీసుకుంటూ ముతా పురం రావాల్సిన లారీ లను పక్క గ్రామాలకు పంపుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న డని ముతా పురం సొసైటీ మాజీ డైరక్టర్ రావెల్ల కృష్ణా రావు ఆరోపించారు. కొనుగోలు కేంద్రం రైతులకు ఊరటనివ్వాల్సింది పోయి భారంగా మారిందని, అధికార యంత్రాంగం వెంటనే స్పందించి దోపిడీకి చెక్ పెట్టాలని అధికారులకు డిమాండ్ చేశారు.

## కారేపల్లిలో రేపు అమిటి ఇండియా బ్రాంచ్ ప్రారంభోత్సవం

- బ్రాంచ్ ఇంచార్జ్ హనుమకొండ రమేష్.

**కారేపల్లి, మే 4, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లో అమిటి ఇండియా బ్రాంచ్ ప్రారంభోత్సవం కలదని బ్రాంచి ఇంచార్జి హనుమకొండ రమేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రేపు అనగా బుధవారం ఆరో తారీఖు నాడు ఉదయం పది గంటల 45 నిమిషాలకు అమిటి ఇండియా శ్రీ లక్ష్మి వేద ఆర్యన్ ఎంటర్ప్రైజెస్ ప్రారంభోత్సవం వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ చేతుల మీదుగా నిర్వహించబడని అన్నారు. మా ఎంటర్ప్రైజెస్ లో ఆరోగ్య సంబంధమైన ఔషధాలు, సోలార్ ప్లేట్లు, ఎలక్ట్రికల్ స్కూటర్లు తదితర వస్తువు లభించునని, ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మండల పరిధిలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

## ఇన్చార్జి సర్పంచిగా బాధ్యతలు స్వీకరించిన ఉప సర్పంచ్ స్వాతి



**కారేపల్లి, మే 4, ప్రజా జ్యోతి:** సింగరేణి మండలం పాత కమలాపురం ఇన్చార్జి స ర్పంచిగా ప్రస్తుతం ఉప సర్పంచ్ గా ఉన్న బానోత్ స్వాతి కి బాధ్యతలు అప్పగిస్తూ డిపిఓ సోమవారం ఆదేశాలను జారీ చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ గా ఎన్నికైన తేజావత్ బాబు రావు బ్రెయిన్ స్ట్రోక్ తో ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో పంచాయితీ పాలకవర్గం పనిచేసేందుకు వీలుగా ఇన్చా ర్జి సర్పంచిగా స్వాతి మరొక వార్డు మెంబెర్ తేజావత్ శ్రీను ను నియమించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి సర్పంచ్ బానోత్ స్వాతి మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధికితన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. గ్రామపంచాయతీ అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా పాటుపడతానని ఆమె పేర్కొన్నారు.

## అకాల వర్షానికి నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి

- అఖిలభారత రైతుకూలీ సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ డిమాండ్



**కారేపల్లి, మే 4, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల వ్యాప్తంగా ఆదివారం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి వేలాది ఎకరాలలో లక్షలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పండించిన మొక్కజొన్న, వరి, మిర్చి, ఇతర పంట చేతికొచ్చిన సమయంలో వర్షానికి తడిసి ముద్దయి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పంట నష్టపోయిన రైతులకు వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వై. ప్రకాష్ అన్నారు. మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయకపోగా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన మొక్కజొన్న పంటలను వేగవంతంగా కొనుగోలు చేసి లారీలతో ట్రాన్స్పోర్ట్ సకాలంలో చేయని మూలంగా నిన్న కురిసిన వర్షానికి భారీగా రైతాంగానికి నష్టం వాటిలిందని దీనికి పూర్తి బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే వహించాలని డిమాండ్ చేసారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి మండలంలో 41 గ్రామపంచాయతీలో మొక్కజొన్న పంట కొనుగోలను వేగవంతం చేయాలని అఖిల పక్షాల రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం కలెక్టర్ కిసమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎస్కే కాసిం, ఎం. గిరి, ఎం.సురేష్, పి. మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో పెళ్లిరోజు వేడుకలు

- వృద్ధులకు పళ్ళు, భోజనాలుపంపిణీ చేసిన మురళి.. సునీత



**సత్తుపల్లి మే04(ప్రజా జ్యోతి )**ఓ యువ జంట తమ పెండ్లి వేడుకలు పదిమందికి ఉపయోగపడేలా, వేంసూర్ లో గల వృద్ధులు అనాధ శరణాలయంలో సత్తుపల్లి పట్టణానికి చెందిన నడ్డి మురళి,సునీత తమ పెండ్లి రోజు వేడుకలు సోమవారం వారి మధ్య ఏర్పాటు చేసుకున్నారు.వృద్ధుల మధ్య కేక్ కటింగ్ చేసి,బోజనాలు,పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా పెండ్లి రోజు వేడుకలు వృద్ధుల మధ్య జరుపుకోవటం, వారికి మంచి ఆహారం అందించటం,చాలా ఆనందంగా ఉందని అన్నారు. మా పెళ్లి రోజు పట్ల కొంత మంది వృద్ధులు పుష్టికరమైన ఆహారం వారు తినటం ఎంతో ఆనందంగా ఉందని, ప్రతి పెళ్లి రోజుకి ఏదో ఒక సేవా కార్యక్రమం ద్వారా మా ఆనందాన్ని ఈ విధంగా పదిమందికి పంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి సిస్టర్స్ జులిత, తేజ, కుమారి, పాపమ్మ, సుజాత, వెంకటేశ్వరి,రోహన్, నాగేశ్వరరావు, శ్రీనివాస్,అక్షయ,వృద్ధులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం రైతు పక్షపాతి

- సర్పంచ్ రంజిత్ కుమార్



**కారేపల్లి, మే 4, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని గాదెపాడు గ్రామ పంచాయతీ పరిధిలో చర్లపల్లి రైతు వేదికలో సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలు ఏ ఈ ఓ బి నరేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి గాదెపాడు సర్పంచ్ భూక్య రంజిత్, కుమార్ గిద్దవారిగూడెం సర్పంచ్ ఈసాల వెంకటేశ్వర్లు, ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలలో ప్రభుత్వం రైతులకి ఇచ్చినటువంటి రైతు బీమా, రైతు భరోసా, రుణమాఫీ, సన్న వడ్లకి 500 బోనస్, భూసార పరీక్షలు, కొత్తగా రైతులకి కరెంటు మీటర్లు అప్లై చేసుకున్న వారికి శాంక్షన్ జేపీయడం జరుగుతుంది అని అన్నారు. ఏవో ఆఫీసులో రైతులందరూ పంట నమోదు చేయించుకోవాలని, రైతులకి వ్యవసాయ పనిముట్లు వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీలో పనిముట్లు అందజేయడం జరుగుతుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పంచాయతీ కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మైబూబి మృతదేహానికి కమల్ నివాళి



**సత్తుపల్లి మే04(ప్రజా జ్యోతి )** పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన సత్తార్ వారి సతీమణి మైబుబి గుండెపోటుతో సోమవారం మృతి చెందినారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా వారి స్వగృహానికి వెళ్లి, ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం సానుభూతి వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో కౌన్సిలర్లు శరత్ చంద్ర, జగన్నాథం శ్రీను,చిలగుండ్ల వెంకటేశ్వరరావు,నిరుడు రాజేష్‌లు ఉన్నారు.

## గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- ఎమ్మార్వో, ఎంపీవో



**కారేపల్లి, మే 4, ప్రజా జ్యోతి:** మండల పరిధిలోని ప్రతి గ్రామంలో వేసవి దృ ష్ట్యా నీటి ఎద్దడి లేకుండా చూడాలని సింగరేణి ఎమ్మార్వో ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీ ఓ మల్లెల రవీంద్ర ప్రసాద్ లు అన్నారు. సోమవారం సింగరేణి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిధిలోని సర్పంచు లు, కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఎంపీ వో మల్లెల రవీంద్ర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎ మ్మార్వో, ఎంపీవోలు, ఏపీఓ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా మండలంలోని ఏ గ్రా మంలో కూడా నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలి, నీటి ఎద్దడున్న గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా నీటి సౌకర్యం కల్పించాలి. జాతీయ ఉపాధి హామీ పథకం ప్రతిష్టంగా అమలు చేయాలి, కొత్త సభ్యులను చేర్పించాలి. జాతీయ జనగణలో భాగస్వాములై ప్రతి ఒక్కరిని స్వీయ జనగణన పోర్టల్ ద్వారా వారి వివరాలను నమోదు చేయించుకునే విదంగా తోడ్పడాలని తెలిపారు. సర్పంచులు కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరే విధంగా కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సర్పంచులు, కార్యదర్శులు, ఏపీఓబి. కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నకోరుకొండి జెడ్పిహెచ్ఎస్ కు 100% ఉత్తీర్ణత

- 46 మంది విద్యార్థుల అద్భుత విజయం



**కల్లూరు, మే 4 ప్రజా జ్యోతి:** కల్లూరు మండలం చిన్నకోరుకొండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2025-26 SSC పరీక్షా ఫలితాల్లో 100% ఉత్తీర్ణత సా ధించి రికార్డు సృష్టించింది. ఈ విద్యా సంవత్సరం పరీక్షలకు హాజరైన మొత్తం 46 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై పాఠశాలకు గొప్ప పేరు తెచ్చారు అని ప్రధానోపాధ్యాయులు వై. రాము అన్నారు. విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. ఇంటి త్రిష అనే విద్యార్థి 570 మార్కులు, ఇంటి ఉమాజ్యోతి 537 మార్కులు, వేల్పుల నందిని 532 మార్కులతో పాఠశాల టాపర్లుగా నిలిచారు. ఈ ఘన విజయాన్ని పురస్కరించుకొని పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గీతా నారపు రెడ్డి, గ్రామ పెద్దలు కుమ్మరి రామారావు, కొంగర రామకృష్ణ, కృష్ణమోహన్ వార్డు మెంబర్ మాడుగుల రాము కలసి విద్యార్థులను ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయం వెనుక ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల కఠోర శ్రమ ఉందని ప్రధానోపాధ్యాయులు వై. రమణయ్య పేర్కొన్నారు. ఇంటి త్రిష, ఉమా జ్యోతి, నందినిలకు 6వేల రూపాయల విలువ గల వాచ్ లను బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలో చేర్పించండి... భవిష్యత్ మార్చుకోండి

**నేలకొండపల్లి, మే 4 ప్రజా జ్యోతి :** ప్రభుత్వ పాఠశాలలకు మీ పిల్లలను పంపించి వారి భవిష్యత్ ను మార్చుకోవాలని రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు సూచించారు. మండలం లోని రాయగూడెం లో సోమవారం బడిబాట కార్యక్రమం ను నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల కోలాటం, డీజే పాటలతో ప్రభుత్వం పాఠశాల కు అందిస్తున్న పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఆయన మాట్లాడారు...ప్రవేట్ కు దీటుగా బోధన ఇవ్వటంతో మంచి ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉన్నత స్థానాలకు చేరుకునే విధంగా ప్రతీ ఒక్కరూ ప్రభుత్వ బడిలో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ.నాగేశ్వరరావు. పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఉషా శ్రీ, అంగన్వాడీ టీచర్లు, విజయలక్ష్మి, సుజాత, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



# విద్యతో పాటు కళాల్లోనూ 'సుధా'కరుడు

- మైక్రో ఆర్టిస్ట్ దర్శకుడైన టీచర్ కు ఆనందో బ్రహ్మ స్వర్ణ నంది



**కల్లూరు మే 04 : ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025 గ్రహీత దంతాల సుధాకర్ ఆనందో బ్రహ్మ స్వర్ణ నంది అవార్డు ను హైదరాబాద్ రవీంద్ర భారతి లో జరిగిన అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు, మాజీ మంత్రి వర్యులు బాబూమోహన్ ద్వారా అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగా ల్లో విశేష ప్రతిభ చూపిన కొంతమందిని ఈ ఆనందోబ్రహ్మ స్వర్ణనంది పురస్కార్ అవార్డులకు మొగిలి మరియు ఎన్ఎస్ ఎంటర్టైన్మెంట్స్ ఎంపిక చేసి ప్రపంచనవ్వుల దినోత్సవం సందర్భంగా అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సుధాకర్ మాట్లాడుతూ విద్యా రంగంలో తాను చేస్తున్న బడిబాట గాని, భోదణరంగంలో ఆర్ పి గా, నూతన భోధన పద్ధ తులు ద్వారా విద్యా భోధన, విద్యార్థుల సంఖ్య పెంచుటకు చేస్తున్న కృషి ని, మరియు నటునిగా దర్శకునిగా సందేశాత్మక లఘు చిత్రాల రూపకల్పన, మై క్రో ఆర్టిస్ట్ గా విశేష ప్రతిభ తదితర అం శాల ఆధారంగా ఈ అవార్డుకు ఎంపిక చేసి నట్లు తెలిపారు. ఈ అవార్డుకి ఎం పిక చేసిన మొగిలి మరియు ఎన్ఎస్ ఎంటర్టైన్మెంట్స్ వారికి ధన్యవాదము లు తెలిపారు. ఈ అవార్డు అందుకున్న సుధాకర్ ను మండల ఉపాధ్యాయులు చెన్నూరు గ్రామస్తులు అభినందించారు.

## రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

- రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి
- సేంద్రియ, జీవన ఎరువుల వైపు మొగ్గు చూపాలి
- సాంప్రదాయ ఏరియాతో పోలిస్తే నానో యూరియా ఎంతో లాభదాయకం
- ప్రజా పాలన కార్యక్రమంలో మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ విజయ్ చంద్ర

**బోనకల్, మే 4(ప్రజా జ్యోతి ):** ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం మండల పరిధిలోని ముష్టికుంట్ల రైతు వేదికలలో వ్యవసాయ అధికారులు భూసార పరీక్ష విధానము ఎరువుల సమతుల్యత, నానో ఎరువుల వాడకం గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. విజయచంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని, దీని వల్ల పోషకాల లోపాలను గుర్తించి తద్వారా సమగ్ర పోషక యాజమాన్యం పాటించవచ్చని తెలిపారు. ప్రభుత్వం రెవెన్యూ గ్రామానికి ఒక సాయిల్ వాలెంటర్లను నియమించిందని, వీరి ద్వారా గ్రామంలోని రైతుల పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించి తద్వారా వచ్చిన భూసార పరీక్ష కార్డు ద్వారా పోషక లోపాలను గుర్తించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ముఖ్యంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ , జీవన ఎరువుల వైపు రైతులు ఆలోచించాలని, సహజసిద్ధమైన వ్యవసాయం ద్వారా పెట్టుబడి తగ్గడంతో పాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందని తెలియజేశారు. సరైన పద్ధతిలో సరైన మోతాదులో సరైన సమయంలో ఎరువులు యాజమాన్యం పాటిస్తే చాలావరకు తెగుళ్లు, పురుగుల బెడద ఉండదని తెలిపారు. గత నెలలో మట్టి నమూనాలను సేకరించిన కొందరి రైతుల ఫలితాల కార్డులను అందజేశారు. భూసార పరీక్ష విధానము మట్టి నమూనాలు సేకరించే విధానం గురించి ప్రయోగాత్మకంగా రైతుల పొలాల్లో చూపించడం కూడ జరిగింది. సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియాలో ఎంతో లాభదాయకంగా ఉంటుందని, ఇది నేరుగా పత్రాలపై పడి పత్ర రంధ్రాల ద్వారా అమ్మోనికల్ నైట్రేట్ రూపం నుంచి నైట్రేట్ రూపంలోకి మారి మొక్క అంతటికి 80% లభ్యం అవుతుందని, వాతావరణానికి ఎటువంటి హానికరం చేయకుండా ఉంటుందని తెలియజేశారు. అలాగే రైతు సోదరులందరూ కూడా ఎరువుల నియంత్రణ పాటిస్తూ ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని ఇది మానవాళి మనుగడకు ఎంతో అవసరమని అన్నారు. అవసరానికి మించి ఒకే విడతలో ఎరువుల వాడకము విరివిగా జరపరాదని విడతలవారీగా ఎరువులు వాడడం వల్ల మొక్క కూడ సరైన దిశలో పెరుగుతుందని అలాగే రైతులందరూ సమగ్ర ఎరువుల యాజమాన్యం, పోషకాల సమతుల్యత, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి సరైన యాజమాన్యం పాటించాలని సూచించారు. అలాగే రైతులు పంట అవశేషాలు కాల్చవదని రైతులకు తెలియజేశారు. పంట అవశేషాలు కాల్చడం ద్వారా నెలలో భూసారం తగ్గుతుందని అన్నారు. అలాగే రైతులు పంట మార్పిడి చేసుకోవాలని దాని ద్వారా తెగుళ్ల సమస్య తగ్గుతుందని ఆయన సూచించారు..ఈ కార్యక్రమంలో ముష్టికుంట్ల సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు,ముష్టికుంట్ల ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రం వద్ద రైతుల నిరసన



**నేలకొండపల్లి, మే 4 ప్రజా జ్యోతి :** మండలం లోని మోటాపురం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద సోమవారం రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్రం వద్ద 25 రోజులు క్రితం కాంటా వేసిన బస్తాలను కూడ ఎగుమతులు చేయలేదని రైతులు ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం వలన మొక్కజొన్న తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటాలు వేగవంతంగా పూర్తి చేయాలని, సీరియల్ ప్రకారం కాంటాలు వేయాలని, వేసిన బస్తాలను ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా లారీ డ్రైవర్లు రైతుల వద్ద నుంచి బలవంతపు వసూళ్ల పై చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన మొక్కజొన్నను మండల వ్యవసాయాధికారి యం.రాధ పరిశీలించారు. కాంటాలు వేసిన బస్తాలను ఎగుమతులు చేసే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడారు...ఎగుమతులు వెంటనే చేసే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. మోటాపురం పంచాయతీ సర్పంచ్ రామారావు తదితర రైతులు పాల్గొన్నారు.

## తడిసిన పంటలను నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలి

- కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చావా కిరణ్



**నేలకొండపల్లి, మే 4 ప్రజా జ్యోతి:** జిల్లాలో కురిసిన ఆకాల వర్షం వలన దెబ్బ తిన్న మొక్కజొన్న, ధాన్యం పంటలను ఎలాంటి నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా కిరణ్ డిమాండ్ చేశారు.మండలం లోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ను సోమవారం సందర్శించారు. తడిసిన మొక్కజొన్న ను పరిశీలించారు. రైతుల తో మాట్లాడి... వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు... ఆకాల వర్షం రైతులను తీవ్రంగా నష్టపరిచిందన్నారు. ధాన్యం, మొక్కజోన్న ఉత్పత్తులను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కొనుగోలు చేసిన బస్తాలను వెంటనే ఎగుమతులు చేయాలని కోరారు. కాంటాలు వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వలనే పంటలు తడిసినట్లు ఆరోపించారు. రైతులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళన లు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజెపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్, ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు పుట్టా సత్యనారాయణ, సూరేపల్లి జ్ఞానరత్నం, కొండా హర్షవర్ధన్ పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా జర్నలిస్టుల అక్రిడిటేషన్ అక్రమాల పై విచారణ చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ కు టీడబ్ల్యూజే ఎఫ్ విజ్ఞప్తి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లాలో 2026–28 సంవత్సరం మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల నియామకం,అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపకులు మామిడి సోమయ్య, ఖమ్మం యూనియన్ నాయకులను కోరారు.ఈ మేరకు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ,ప్రధాన కార్యదర్శి నగేష్ల నేతృత్వంలో ప్రతినిధి బృందం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మీడియా అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో, ఖమ్మం జిల్లాలో కమిటీ నియామకం,దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత లోపించిందని, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని,ముఖ్యంగా,ఖమ్మం జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల నియామకంలో అన్ని జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించకుండా, ఒకే యూనియన్ కు చెందిన పలువురికి ప్రాధాన్యత ఇచ్చినట్లు అభ్యంతరాలువ్యక్తమవుతున్నాయని,కమిటీ నియామకం ప్రక్రియపై ముందస్తుగా ఎలాంటి అధికారిక నోటీసు లేదా సమాచారం ఇవ్వకుండానే గోప్యంగా నిర్వహించినట్లు జర్నలిస్టు వర్గాల్లో అనుమానాలు నెలకొన్నాయని,కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ఆన్లైన్ లో దాఖలు చేయబడిన దరఖాస్తుల పరిశీలనలో అనర్హమైన దరఖాస్తులకు కూడా ఆమోదం తెలిపినట్లు సమాచారం అందుతోందని, ప్రభుత్వ జీవో నెం. 252 ప్రకారం నిర్దేశించిన ప్రమాణాలు, పత్రికల ప్రామాణికత, సర్క్యులేషన్ ఆధారాలు, సంస్థ అనుమతులు, నియామక పత్రాలు, అనుభవ ధృవీకరణ పత్రాలు, పే స్లిప్పులు వంటి ముఖ్యమైన పత్రాలను సమగ్రంగా పరిశీలించకుండానే అక్రిడిటేషన్ కార్డులజారీ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోందని, వాటిని బహిర్గతం చేస్తూ చర్యలు చేపట్టాలని కోరారు. వెరిఫికేషన్ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించకుండా తూతూ మంత్రంగా పూర్తి చేసినట్లు,మీడియా రంగంపై సరైన అవగాహన, ఫీల్డ్ అనుభవం లేని వారిని కూడా అర్హులుగా పరిగణించినట్లు అభ్యంతరాలు ఉన్నాయని, ఈ పరిణామాల వల్ల నిజంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు అన్యాయం జరిగే అవకాశం ఉందనివారు ఆందోళన వ్యక్తం చేశారు.అందువల్ల పై అంశాలపై సమగ్ర విచారణ జరిపించి,నిబంధనలకు విరుద్ధంగా ఆమోదించబడిన దరఖాస్తులను పునఃపరిశీలించి,అర్హులైన,నిజమైన మీడియా ప్రతినిధులకు మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు జారీ అయ్యేలా, భవిష్యత్తులో మీడియా అక్రిడిటెషన్ కమిటీలో అన్ని సంఘాలకు తగిన ప్రాధాన్యత చర్యలు తీసుకోవాలని వినమ్రంగా కోరారు. ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి, మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియలో పారదర్శకత,నిష్పక్షపాతత్వం, సమాన అవకాశాలు పాటించబడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజెఎఫ్ హెచ్ 2843 అధ్యక్షులు నానబాల రామకృష్ణ,ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్,కోశాధికారి వేములకొండ రమేష్,ఉపాధ్యక్షులు కందరబోయిన నాగ కృష్ణ,మామిడాల కిరణ్,టీబీజేఏ జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి కరుణాకర్ సుదగాని,టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్, టీబీజేఏ నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్,సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్,రమ్య, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నగల దుకాణాలల్లో సిసిటివి కెమెరాలను,ఆటోమాటిక్ అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలి


- పోలీస్ కమిషనర్ సునీల్ దత్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఆదివారం కరీంనగర్‌లో పిఎంజె జ్యువెలర్స్‌లో జరిగిన దోపిడీ, కాల్పుల ఘటన నేపథ్యంలో ఖమ్మం నగరంలోని నగల దుకాణాల యజమానులతో,షోరూం దుకాణాల ప్రతినిధులతో సమన్వయ సమావేశం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు.సమావేశం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నగల దుకాణాల్లో భద్రతతో పాటు సీసీటీవీ నిఘా,అలారం వ్యవస్థలు,యాక్సెస్ కంట్రోల్ వంటి ఆధునిక భద్రతా ఏర్పాట్లు పెంచాలని సూచించారు.అదేవిదంగా మెటల్ డిటెక్టర్ పరికరాలను అమర్చుడం ద్వారా భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. నగల దుకాణాల వద్ద భద్రతను విధిగా సమీక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు.అదేవిదంగా పగలు,రాత్రివేళల్లో ఆయుధాల కలిగిన పోలీస్ బృందాలతో ప్రత్యేక గస్తీ నిర్వహిస్తూ నిఘాను పెంచాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో సైతం ఇటువంటి దోపిడీ ఘటనలు తరచూ జరుగుతున్న నేపథ్యంలో పునరావతం కాకుండా అడ్డుకునేందుకు నిరంతరం అప్రమత్తం ఉండాలన్నారు.అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని పేర్కొన్నారు.సమావేశంలో ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రరెడ్డి, ఎస్బి ఏసీపీ మహేష్, సిఐలు కరుణాకర్, మోహన్ బాబు,బాలకృష్ణ,మురళి,సంజీవ్రాజు తదితరులు పాల్గొన్నారు.

## గాలి దుమారానికి విరిగిన విద్యుత్ స్తంభాలు

- మండలంలో 15 గంటల పాటు తెల్లవారులు విద్యుత్ సరఫరాకు అంతరాయం
- విద్యుత్ అంతరాయంతో విలవిలలాడిన మండల ప్రజలు
- యుద్ధ ప్రాతిపదికన తక్షణ చర్యలు చేపట్టిన విద్యుత్ శాఖ అధికారులు
- మళ్లీ మండలంలో యధావిధిగా విద్యుత్ సరఫరా





**బోనకల్, మే 4 (ప్రజా జ్యోతి)**: మండలంలో ఆదివారం రాత్రి అకస్మాత్తుగా సంభవించిన గాలి దుమారం కారణంగా వివిధ గ్రామాలలో విద్యుత్ సరఫరా తీవ్రంగా అంతరాయం కలిగింది. ముఖ్యంగా 33కెవి బోనకల్ ఫీడర్ పరిధిలో జానకిపురం గ్రామ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు విరిగిపోవడంతో 4 33కెవి విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీనితో ఆదివారం రాత్రి మండల వ్యాప్తంగా తెల్లవార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అంతరాయంతో తెల్లవారులు ఉక్క పోతతో మండల ప్రజలు విలవిలలాడారు. అదేవిధంగా, బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో విద్యుత్ కండక్టర్ లైన్ తెగిపోవడం, వల్లాపురం గ్రామ సమీపంలో 33కెవి ఇన్సులేటర్ విరిగిపడటం విద్యు స్తంభాలు విరిగిపోయాయి. అదనంగా, 11కెవి, ఎల్టి లైన్లపై భారీగా చెట్లు పడిపోవడంతో అనేక గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.ఈ పరిస్థితికి స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది తక్షణమే చర్యలు చేపట్టి, బోనకల్లు సెక్షన్ సిబ్బంది కాంట్రాక్టర్ల సహాయంతో విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతంగా ప్రారంభించారు. విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. తెగిపోయిన తీగలను సరి చేసి లైన్లపై పడిన చెట్లను తొలగించారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తు పనులు చేపట్టారు.గ్రామాల్లో విద్యుత్ లైన్లపై పడిన చెట్లను తొలగించుటలో ఆయా గ్రామాల సర్పంచులు , స్థానిక ప్రజలు అందించిన సహకారం వలన పునరుద్ధరణ పనులు మరింత వేగంగా కొనసాగాయి.విద్యుత్ సరఫరా పూర్తిగా పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన పని చేస్తు విద్యుత్ సరఫరా పునరుద్ధించారు. దీనితో మళ్లీ యధావిధిగా విద్యుత్ సరఫరాను కొనసాగించారు.

## పదవ తరగతి ఉతీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలియజేసిన వేంసూర్ సర్పంచ్ పక్రుద్దీన్





**వేంసూరు మే 04 ప్రజాజ్యోతి** ఉతీర్ణులైన వేంసూరు హైస్కూల్ విద్యార్థులను గ్రామ సర్పంచ్ ఫకృద్దీన్ శాలువతో సత్కరించారు.గ్రామ పంచాయతీ కార్యాలయం వేంసూరు లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 500 పైగా మార్కులు సాధించిన పది మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు.సర్పంచ్ ఫకృద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలు పేద మధ్యతరగతికి చెందిన వారని,ఉత్తమ ఫలితాలు సాధించిడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు.పిల్లల విజయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు.క్రమశిక్షణతో ఉండి ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.ప్రధానోపాధ్యాయులు సుధాకర రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదల విజయానికి కారణమన్నారు. ఇంటర్ లో నచ్చిన కోర్సులో చేరి ఉన్నత చదువులు చదివి మంచి పౌరులుగా స్థిరపడాలన్నారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జీన్నత్ బేగం మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు మాట్లాడుతూ అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసిన సర్పంచ్ ఫకృద్దీన్ గారికి ధన్యవాదములు తెలియజేసారు.ఉమర్ ఫరూక్ 533,తేజస్వి 527,జశ్వంత్ 523,హసీనా 522,చంద్రశేఖర్ 521,రాజశేఖర్ 515,రజియా సుల్తానా 515,సన 511, సాయి రష్మిత 510,రిజ్వానా 500 మార్కులు సాధించడం పాఠశాల గర్వించదగ్గ విషయం అని వక్తలు కొనియాడారు.సర్పంచ్ ఫకృద్దీన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర రెడ్డి, ఉపాధ్యాయులు బి కె నరసింహారావు, రవికుమార్, ఉమామహేశ్వర రెడ్డి, గ్రామ కార్యదర్శి కిషోర్ బాబు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జీన్నత్ బేగం, వార్డు సభ్యులు యాకుబ్ నబీ, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి తడిచిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

- అన్నదాతలు ఎవరు అధైర్య పడవద్దు
- కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు



**నెలకొండపల్లి, మే 4 ప్రజా జ్యోతి :** రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వందే అని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు అన్నారు..ఈసారి పంట దిగుబడి అధికంగా రావడంతో కొనుగోలు కొంత ఆలస్యమైందని ఆయన తెలిపారు.ఇప్పటికే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు తీసుకొచ్చిన మొక్కజొన్న,ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాలో నగదు సైతం జమ చేస్తుందని ఆయన చెప్పారు.రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిన్న వర్షానికి తడిచిన ధాన్యం,మొక్కజొన్నలను కూడా కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వందే అని ఆయన పేర్కొన్నారు. అన్ని విధాలుగా ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు.

## మజీద్ ఇంటికి వెళ్లి పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** 42 డివిజన్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మజీద్ కి ఆపరేషన్ జరిగిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ మజీద్ ఇంటికి వచ్చి తన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. దేవుని దయవల్ల త్వరగా కోలుకోవాలని సుఖ సంతోషాలతో ఉండాలని ఆ దేవుని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర అధ్యక్షులు దీపక్ చౌదరి,డివిజన్ కార్పొరేటర్ శేషగిరి విజయనిర్మల డివిజన్ అధ్యక్షులు గౌస్ ముఖ్య నాయకులు సమద్ షౌకత్ గౌస్ ఆయిషా, షాహిన్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రమ శక్తి అవార్డు గ్రహీతను ఘన సన్మానం

- ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు



**సత్తుపల్లి మే04(ప్రజా జ్యోతి )**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కార్మికుల శ్రమను గుర్తించి ఇచ్చే అవార్డు శ్రమశక్తి నీ సత్తుపల్లి ఏరియాలోని కిష్టారం ఓ పెన్ కాస్ట్ లో పనిచేసే ఐ.ఎన్.టి.యూ.సి పిట్ సెక్రటరీ గాజే బాలాజీకి రావటం అభినందనీయం.ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి కోటేశ్వరరావు బాలాజీని వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమను గుర్తించి,రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డు బాలాజీ ఇవ్వండం సంతోషంగా ఉన్నదని, కార్మికుల శ్రేయస్సుకు బాలాజీ మరింత కృషిచేసి ఉద్యోగులకు సహాయ సహకారాలు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలోఐ ఎన్ టి యు సి బ్రాంచ్ సెక్రటరీ నాగప్రకాష్,బ్రాంచ్ నాయకులు సందీప్, హరికుమార్, మాలోత్ అశోక్,ఇక్బాల్, సుదర్శన్, వి.శ్రీనివాస్, గోపి, వెంకటేష్, హమీద్, వెంకటేశ్వర్లు, మోరే సుదర్శన్, రామచందర్,షద్రక్ బాబు, కనకయ్య, బాలు, రాజ్ కుమార్,దాసరి శ్రీనివాస్, రవికాంత్, శ్రీకాంత్, రాజేందర్, సుకురు, షణ్ముఖ చారి,కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతం కానున్న మొక్కజొన్న కొనుగోలు

- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తాసిల్దార్ సైదులు, మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి



**పాలేరు ఆర్.సి మే 4 ప్రజా జ్యోతి** గత రాత్రి కురిసిన అకాల వర్షాల దృష్ట్యా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కూసుమంచి తహసిల్దార్ సైదులు మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాను సారం ట్రాక్టర్ల ద్వారా కాటా వేసిన మొక్కజొన్నను చేగొమ్మ గోడౌన్ కు తరలించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని తెలియజేశారు. కావున రైతులు ఎవరు అధైర్య పడొద్దనీ సూచించారు. ట్రాక్టర్ల ద్వారా రవాణాను అనుమతించినందున త్వరితగతిన కొనుగోలు జరుగుతుందని ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నరైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం చేగొమ్మ లోని గోదాము నందు దిగుమతికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు .ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జానీ బాబా, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాము రైతులు పాల్గొన్నారు.

## కూసుమంచిలో బిజెపి శ్రేణులు సంబరాలు

**పాలేరు ఆర్.సి మే 4 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలం కేంద్రంలో పశ్చిమ బెంగాల్ మరియు అస్సాం, పుదుచెర్రీ లో బీజేపీ ఘనవిజయం సాధించిన సందర్భంగా స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఆధ్వర్యంలో కూసుమంచి లో సంబరాలు టపాసులు కాల్చి స్వీట్ పంచి సంబరాలు చేసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకున్నారని, మమతా బెనర్జీ అరాచక పాలన నుంచి విముక్తి పొందేందుకు బీజేపీని గెలిపించారని అన్నారు. దేశంలో మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచిన నేపథ్యంలో సోమవారం కూసుమంచి సెంటర్ వద్ద సంబరాలు నిర్వహించారు. బెంగాల్లో బీజేపీ చరిత్ర సృష్టించిందన్నారు. ఊహించిన దానికంటే భారీ సీట్లు కైవసం చేసుకుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దాసరి వెంకటేశ్వర్లు బానోతు హత్యా నాయక్ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్ నాయక్ వడ్డెంపుల నరేష్ కూరపాటి నరేష్ కూరపాటి భాస్కర్ లక్ష్మయ్య ఉపేందర్ మధు తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

- అక్రమ రవాణా జరిగితే 8712659111 కు సమాచారం ఇవ్వాలి
- పోలీస్ కమిషనర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

ఆవులు, దూడల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం,వ్యక్తిగత దాడులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.పశువుల రవాణాకు సంబంధించిన నిబంధనలు,చట్టపరమైన అంశాలపై గో రక్షణ కమిటీ తో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గో రక్షకుల పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోని దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు వుంటాయని అన్నారు.పశువుల అక్రమ రవాణాను గమనిస్తే, వెంటనే 8712659111 కు, స్థానిక పోలీసులకు, డయల్ 100 కు సమాచారం అందించి సహకరించాలన్నారు.ఇప్పటికే జిల్లా సరిహద్దులో ఏడు చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించి, పట్టుబడిన పశువులను దగ్గరలోని గోశాలలకు తరలించాలని ఆదేశించామన్నారు. ఆవులు, దూడల అక్రమ రవాణా, అమ్మకం లేదా వధకు వ్యతిరేకంగా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని అన్నారు.చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా జంతువుల కదలికలను పర్యవేక్షించడానికి అధికారు లు మూడు షిఫ్టులలో చెక్పాయింట్ల ను ఏర్పాటు చేసారని అన్నారు. పశువుల రవాణాదారులు అందరూ పశువైద్యుల నుండి చెల్లుబాటు అయ్యే ధృవపత్రాలు, అధికారిక రవాణా రసీదులను కలిగి ఉండాలన్నారు.శాంతిని కాపాడటానికి జంతు సంక్షేమ నిబంధనలను పాటించడానికి పరిపాలనకు సహకరించాలని సంబంధిత వర్గాలందరికీ విజ్ఞప్తి చేశారు.ఏమైనా సమస్యలుంటే స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సం ఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తును పటిష్టం చేస్తామన్నారు. ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, మహేష్, సిఐ లు పాల్గొన్నారు.

## అకాల వర్షం... అపార నష్టం

- నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి సీపీఐ
- వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి



**పాలేరు ఆర్.సి మే 4 ప్రజా జ్యోతి** ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కూసుమంచి మండల కార్యదర్శి భూక్యా నరసింహ, జిల్లా సమితి సభ్యులు గుండెపొంగు మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని, గైగోళ్ళపల్లి, లాల్ సింగ్ తండా, సంధ్యా తండా గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రతినిధుల బృందం రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి కోతలు మొదలుపెట్టి సుమారు 45 రోజులు అయినప్పటికీ ఉమ్మడి గ్రామపంచాయతీలో ఐకెపి వరి ధాన్య కొనుగోలు కేంద్రంని ఏర్పాటు చేయకపోవడం వలన ఈ పరిస్థితి నెలకొంది అని ఆరోపించారు. ఐకెపి సెంటర్లో ధాన్యాన్ని ఆరబెట్టిన ప్రతి రైతుకు సిబ్బంది పట్టాలు అందజేయలేదని దానివల్లనే ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి తరుగులు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల అధ్యక్షులు భూక్య ప్రసాద్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం ముందస్తు చర్యలు వచ్చే పట్టకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారాన్ని అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాండురంగాచారి, భూక్య శ్రీకాంత్, జిల్లా నాగయ్య, జిల్లా వీరయ్య, మామిడాల వెంకన్న, స్థానిక రైతులు సైదులు, పరకాల రవి, లాల్ సింగ్ ధరవాత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలు సరదగా టపాసులు కాల్చటంతో వంద దిండ్లు గడ్డి దగ్ధం

**నేలకొండపల్లి, మే 4 ప్రజా జ్యోతి :**చిన్నారులు సరదగా ఆటలు ఆడుకుంటూ టపాసులు కాల్చటం తో ప్రమాదవశాత్తు వరి గడ్డి దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం నేలకొండపల్లి మండలం లోని మంగాపురంతండా లో సోమవారం సరదగా టపాసులు కాల్చుకుంటున్నారు. ఈనేపథ్యంలో పక్కనే ఉన్న బాబురావు అనే రైతు కు చెందిన వరి గడ్డి పై నిప్పులు పడి అగ్నికి అహుతైంది. దాదాపు వంద దిండ్లు దగ్ధమైంది. ఈ ఘటన తో ఒక్కసారిగా చిన్నారులు కంగారుపడి ఆందోళన చెందారు. మంటలను స్థానికులు అదుపులోకి తీసుకొచ్చారు.





## నేల పరిరక్షణ పై రైతులకు అవగాహన

- మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి



**పాలేరు ఆర్.సి మే 4 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలంలోని ఎనిమిది క్లస్టర్లలోని 8 రైతు వేదికలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవం ప్రారంభించడం జరిగింది. కూసుమంచి రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నేల పరిరక్షణ, మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్ష ప్రాముఖ్యత ,సమతుల ఎరువుల యాజమాన్యం, పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల కలిగే అనర్థాలు, విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు, బిటి 3 పత్తి విత్తనాల వల్ల కలిగే అనర్థాలు , పచ్చి రొట్ట ఎరువుల ప్రాముఖ్యత, మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు.భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి గారు రైతులందరూ వ్యవసాయశాఖ సూచనలు పాటించాలని , ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.టెక్నికల్ ఏవో అరుణ గారు వేసవి లోతు దుక్కుల ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం మట్టి పరీక్ష కొరకు నమూనాల సేకరణ విధానాన్ని చూపించారు. నేలను పరిరక్షించుకుంటామని, సాయి రైతులకు అవగాహన కల్పిస్తామని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి రామారావు ,ఉప సర్పంచ్ వెంకట రమణ, వ్యవసాయ విస్తరణ అధికారులు జానీ, సాయిరాం, సౌమ్య , నవీన్ , రవి కుమార్ , ప్రియాంక,రవీందర్ మరియు ఆయా గ్రామాల సర్పంచులు ,రైతులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంట దగ్ధం





**బోనకల్, మే 4(ప్రజా జ్యోతి ):**మండల పరిధిలో గోవిందపురం ఎల్ గ్రామం లో మొక్కజొన్న దంటుకు నిప్పు పెట్టడంతో గాలి దుమారానికి ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో మంటలు చల్లారేగడంతో మొక్కజొన్న పంట దగ్ధమైంది. ఎర్రబోయిన నాగేశ్వరరావు, రాసి పోసి ఉన్న మొక్కజొన్న పూర్తిగా దగ్ధమై కాలిపోయింది. విషయం తెలుసుకున్న రైతు వెంటనే తన పొలం దగ్గరకు వెళ్లగా మంటలు చెలరేగడంతో రైతు కుప్పకూలిపోయాడు.ఈ సందర్భంగా రైతు నాగేశ్వరరావు,మాట్లాడుతూ... పక్కనే ఉన్న పొలం రైతు తన పొలంలో దంటు కాల్చేందుకు నిప్పు పెట్టడంతో 1 ఎకరం 2 కుంటల పొలంలో పండిన మొక్కజొన్నలు 50 క్వింటాల కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆరుగాలం పండించి పెట్టుబడి పెట్టి రెక్కలు ముక్కలు చేసుకుని పంట చేతికొచ్చే టైంలో అగ్ని కి బహుతి కావడంతో బాధిత రైతు లబోదిబోమంటున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంట బూడిద పాలు అయిందని రైతు కన్నీరు మున్నీరవుతున్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధిత రైతు నాగేశ్వరరావు కోరారు .